సాక్షి విశాఖపట్నం

గురువారం । 26 । జనవరి । 2023



ఉత్సాహంగా వాక్‌థాన్

జాతీయ పర్యాటక దినోత్సవం సందర్భంగా బుధవారం ఆర్కే బీచ్‌లో టూరిజం వాక్‌థాన్ ఉత్సాహంగా సాగింది. 8లో



లక్ష్య నిర్దేశకులదే విజయం

'సాక్షి' ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు హోరాహోరీగా జరుగుతున్నాయి. రెండో రోజు పోటీల్లో లక్ష్య నిర్దేశకులే విజయం సాధించారు. 8లో



మత్తు ఇంజక్షన్లు స్వాధీనం

76 మత్తు ఇంజక్షన్లు కలిగిఉన్న ముఠాను ఎస్ఈబీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. 8లో

న్యూస్‌రీల్

గణతంత్ర దినోత్సవానికి ఏర్పాట్లు



పోలీసుల రిహార్సల్స్

మహారాణిపేట(విశాఖ దక్షిణ): పోలీసు బ్యారెక్స్ స్టేడియంలో 74వ గణతంత్ర దిన వేడుకలకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. గురువారం ఉదయం 9 గంటలకు కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారు. అనంతరం జిల్లా ప్రగతిపై సందేశం ఇస్తారు. ఈ సందర్భంగా 400 మంది అధికారులు, ఉద్యోగులు, స్వచ్ఛంద సేవా సంస్థలకు ప్రతిభా పురస్కారాలు కలెక్టర్ అందజేస్తారు. పది ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో శకటాల ప్రదర్శన నిర్వహిస్తారు. వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన 24 కోట్ల రూపాయల ఆస్తులను లబ్ధిదారులకు పంపిణీ చేస్తారు. స్వాతంత్య్ర సమరయోధులు, పద్మశ్రీ పురస్కార గ్రహీతలు, అర్జున పురస్కార గ్రహీతలు, ముఖ్య వ్యక్తుల పరిచయ కార్యక్రమం ఉంటుంది. పలు పాఠశాలల విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఆర్డీవో హుస్సేన్ సాహెబ్ ఆధ్వర్యంలో తహసీల్దార్లు శ్యామ్, అర్జునరావు పర్యవేక్షణలో ఏర్పాట్లు చేశారు.

డీఎస్పీ, ఎస్‌ఐలకు ఇండియన్ పోలీసు మెడల్స్



డీఎస్పీ ప్రవీణ్‌కుమార్



ఎస్‌ఐ సూరిబాబు

మహారాణిపేట/జగదాంబ: పోలీసు శాఖలో ఉత్తమ సేవలు అందించినందుకు విశాఖ జిల్లాకు చెందిన ఇద్దరు పోలీసు అధికారులను ఇండియన్ పోలీసు మెడల్స్ వరించాయి. జిల్లా శిక్షణా కేంద్రం డీఎస్పీ కొరంగి ప్రవీణ్‌కుమార్, హార్బర్ క్రైం ఎస్‌ఐ దార సూరిబాబు ఇండియన్ పోలీసు మెడల్‌కు ఎంపికయ్యారు. సూరిబాబు పలు ముఠాలను పట్టుకోవడంతో శక్తి సామర్థ్యాలు చూపించారు. నగరంలో అనేక కేసులు ఛేదించడంతో 160 రివార్డులు, 44 కమాండెషన్స్, 31 ప్రశంసా పత్రాలు పొందారు. 2007లో ఉమేష్‌చంద్ర అవార్డు, 2016 ఏపీ పోలీసు సేవా పథకం, 2020 ఎ.బి.సి.డి అవార్డ్స్, 2021 డీజీపీ కమాండెషన్ అవార్డు, 2022లో ఏపీ పోలీసు ఉత్తమ సేవా పథకాలు వరించాయి.

స్టాఫ్‌నర్సు పోస్టుల రెండో విడత కౌన్సెలింగ్

మహారాణిపేట(విశాఖ దక్షిణ): స్టాఫ్ నర్సుల పోస్టులకు సంబంధించి రెండో విడత కౌన్సెలింగ్ బుధవారం నిర్వహించారు. 21 మందికి నియామక ఉత్తర్వులు అందజేశారు. ఈనెల 20న తొలి విడతలో 128 మందికి కౌన్సెలింగ్ నిర్వహించి నియామక పత్రాలు అందజేసిన విషయం తెలిసిందే. ఇంకా 30 పోస్టులు పెండింగ్‌లో ఉన్నాయి. విమ్స్‌లో 24 పోస్టులకు గాను తొలి విడత 18 పోస్టులు, రెండో విడత 3 పోస్టులు భర్తీ కాగా.. ఇంకా 3 పోస్టులు పెండింగ్‌లో ఉన్నాయి. వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో ఉండే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 108 పోస్టులకు గాను తొలి విడత 81 పోస్టులు, రెండో విడత 9 పోస్టులు భర్తీ చేశారు. 18 పోస్టులు పెండింగ్‌లో ఉన్నాయి. ఏపీ వైద్య విధాన పరిషత్ పరిధిలో 47 పోస్టులకు గాను తొలి విడత 29 పోస్టులు, రెండో విడత 9 పోస్టులు భర్తీ కాగా.. ఇంకా 9 పోస్టులు పెండింగ్‌లో ఉన్నాయని వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ డైరెక్టర్ ఉమా సుందరి తెలిపారు. మొత్తం 179 పోస్టులకు గాను రెండు విడతల్లో 149 పోస్టులు భర్తీ చేశామని, 30 పోస్టులు వరకు పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు.

అల్లూరి విజ్ఞాన కేంద్రంలో గ్రూప్-2 శిక్షణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మేయర్

డాబాగార్డెన్స్(విశాఖ దక్షిణ): అల్లూరి విజ్ఞాన కేంద్రంలో అల్లూరి స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో నిర్వహించే గ్రూప్-2 శిక్షణను అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి పిలుపునిచ్చారు. శిక్షణకు సంబంధించిన పోస్టర్‌ను నిర్వాహకుడు కె.అభిమన్యుతో కలిసి బుధవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. శిక్షణలో చేరేందుకు ఆసక్తి గల యువత డాబాగార్డెన్స్‌లోని అల్లూరి స్టడీ సర్కిల్‌ను నేరుగా సంప్రదించాలి. మరిన్ని వివరాలకు 80084 12798లో తెలుసుకోవచ్చు. నిర్వాహక సభ్యులు అభిషేక్, హర్షకుమార్ పాల్గొన్నారు.

పుడమి రక్షణ మన బాధ్యత

- రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి అమర్‌నాథ్
- జోడుగుళ్లపాలెంలో 'పుడమి సాక్షిగా' బీచ్ క్లీనింగ్
- భాగస్వాములైన ఉన్నతాధికారులు, నగర పౌరులు



పుడమి సాక్షిగా కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్





జోడుగుళ్లపాలెం బీచ్‌లో చెత్త సేకరిస్తున్న మంత్రి అమర్‌నాథ్, కమిషనర్ రాజాబాబు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, తెలుగు అకాడమీ చైర్‌పర్సన్ లక్ష్మీపార్వతి

ఆరిలోవ(విశాఖ తూర్పు): పర్యావరణ పరిరక్షణకు అందరి సహకారం అవసరమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ పిలుపునిచ్చారు. 'సాక్షి'టీవీ చానల్ ఆధ్వర్యంలో బుధవారం జోడుగుళ్లపాలెం బీచ్‌లో 'పుడమి సాక్షిగా' పేరుతో బీచ్ పరిశుభ్రత కార్యక్రమం జరిగింది. మంత్రి అమర్‌నాథ్‌తో పాటు ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, తెలుగు అకాడమీ చైర్‌పర్సన్ లక్ష్మీపార్వతి, జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్, నగర పోలీస్ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్, జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు, పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, పాఠశాలల విద్యార్థులు, ప్రకృతి ప్రేమికులు ఈ కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. ప్లాస్టిక్ సంచులు, మద్యం బాటిళ్లు, పేపరు ప్లేట్లు, దుస్తులను సంచుల్లో వేసి.. జీవీఎంసీ పారిశుధ్య సిబ్బందికి అందజేశారు. జీవీఎంసీ వాహనాల ద్వారా చెత్తను డంపింగ్‌యార్డుకు తరలించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు 'పుడమి సాక్షిగా' పేరుతో 'సాక్షి' మీడియా చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. 'సాక్షి' సమాజాన్ని మేల్కొలిపే కార్యక్రమం చేపట్టిందన్నారు. ఇలాంటి బాధ్యతాయుత కార్యక్రమాలకు తమవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. నగరాభివృద్ధికి, కాలుష్య నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.





బీచ్‌లో చెత్త సేకరిస్తున్న పలు పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు

ప్లాస్టిక్ వాడకాన్ని అందరూ నిషేధించాలన్నారు. బీచ్‌లో వ్యర్థాలు వేయకుండా.. సముద్ర జలాలు కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. వ్యర్థాలను రీయూజ్, రెడ్యూస్, రీసైకిల్ చేయడం వల్ల కాలుష్యం నుంచి బయటపడవచ్చన్నారు. తెలుగు అకాడమీ చైర్‌పర్సన్ లక్ష్మీపార్వతి, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి మాట్లాడుతూ అందరం కలిసి ప్రకృతిని కాపాడుకుని.. భవిష్యత్ తరాలకు అందిద్దామన్నారు. నిజాలను నిర్భయంగా రాయడంతో పాటు సామాజిక సేవలో సైతం 'సాక్షి' ముందుండటం అభినందనీయమన్నారు. జేసీ విశ్వనాథన్, జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు, సీపీ శ్రీకాంత్ మాట్లాడుతూ 'పుడమి సాక్షిగా' కార్యక్రమంలో తమను కూడా భాగస్వాములను చేయడంపై సంతోషం వ్యక్తం చేశారు. ప్లాస్టిక్ వ్యర్థాలతో మానవ మనుగడకే ప్రమాదమన్నారు. ప్లాస్టిక్ నిషేధానికి నగర ప్రజలంతా సహకరించాలని కోరారు.

ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు, భీమిలి ఆర్డీవో భాస్కరరెడ్డి, జీవీఎంసీ సీఎంహెచ్‌వో డాక్టర్ శాస్త్రి, ది హార్బర్ ఇంటర్నేషనల్ స్కూల్ సీఈవో రఘురాజు, మాస్టర్ ఈకే జనరేలం ఫౌండేషన్ నిర్వాహకుడు సీహెచ్ శ్రీనివాసరావు, వాకర్స్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.పి రవీంద్ర, సభ్యురాలు ఉప్పలపాటి శుభ, యూనివర్స్ యూత్ వాకర్స్ కో-ఆర్డినేటర్ ఇంద్ర దీప్తి, ఏయూ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ పి.శైలజ, హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ ప్రతినిధులు, ఏయూ ఎన్ఎస్ఎస్ యూనిట్ వలంటీర్లు, ది హార్బర్ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు, హనీ గ్రూప్ ప్రతినిధులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతిష్టాత్మకంగా గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్





జిల్లా స్థాయి సమన్వయ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్, చిత్రంలో స్పెషల్ సీఎస్ కరికాల వలవన్, పరిశ్రమ శాఖ డైరెక్టర్ సృజన, జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు, సీపీ శ్రీకాంత్, జేసీ విశ్వనాథన్, హాజరైన వివిధ శాఖల అధికారులు

- ఏయూ వేదికగా మార్చి 3, 4 తేదీల్లో నిర్వహణ
- రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి అమర్‌నాథ్ వెల్లడి

మహారాణిపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు మార్చి 3, 4 తేదీల్లో గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్-2023ను ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. సదస్సు నిర్వహణ, ఏర్పాట్లకు సంబంధించి బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి సమన్వయ సమావేశం జరిగింది. స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆర్.కరికాల వలవన్, పరిశ్రమల శాఖ డైరెక్టర్ జి.సృజన పాల్గొన్న ఈ కార్యక్రమంలో మంత్రి మాట్లాడారు. ఆంధ్రా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో ఈ సమ్మిట్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సదస్సుకు దేశ, విదేశాల నుంచి సుమారు 2,500 మంది ప్రతినిధులు హాజరవుతున్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలో పరిశ్రమలు స్థాపించేందుకు ఉన్న అనుకూలతలు, ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను వివరించి.. పెట్టుబడులను ఆకర్షించేందుకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రోడ్‌షోలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అగ్రికల్చర్, ఫుడ్ ప్రాసెసింగ్, ఏరోస్పేస్, డిఫెన్స్, ఆటోమొబైల్, ఎలక్ట్రిక్ వెహికల్స్, టెక్స్ టైల్స్, ఇండస్ట్రియల్ లాజిస్టిక్స్ ఇన్‌ఫ్రాస్టక్చర్, పెట్రోలియం అండ్ పెట్రోలియం కెమికల్స్, ఎలక్ట్రానిక్స్, ఐటీ, టూరిజం, ఎంఎస్ఎంఈ, స్టార్టప్స్ వంటి 13 రంగాలకు సంబంధించిన కంపెనీలను ఆకర్షించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగ కల్పనకు ఈ సదస్సు ఉపయుక్తంగా నిలుస్తుందన్నారు. సదస్సుకు సంబంధించి జిల్లా స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేశామని.. సంబంధిత శాఖల అధికారులు పూర్తి సమన్వయంతో పనిచేసి సమ్మిట్‌ను విజయవంతం చేయాలని ఆదేశించారు.

స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆర్.కరికాల వలవన్ మాట్లాడుతూ రాష్ట్రం పెట్టుబడులకు గమ్యస్థానమన్నారు. విశాఖ వేదికగా మార్చిలో రెండు అంతర్జాతీయ సదస్సులు జరుగుతున్నాయన్నారు. ఏయూ ఇంజినీరింగ్ మైదానంలో నిర్వహించే ఈ సదస్సుకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు తిలకించేందుకు ఐదు ఎకరాల్లో 250 స్టాళ్లతో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. పట్టణంలోని పర్యాటక ప్రాంతాలు, కూడళ్లు, రోడ్లను అందంగా తీర్చిదిద్దాలన్నారు. పరిశ్రమల శాఖ డైరెక్టర్ జి.సృజన మాట్లాడుతూ ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న సదస్సుకు సకాలంలో అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు.

ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ వి.రవీంద్రనాథ్, ఏపీఐడీసీ చైర్‌పర్సన్ బి.ఎస్.నాగేంద్ర పుణ్యశీల, హ్యాండిక్రాఫ్ట్స్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ బి.విజయలక్ష్మి, ఏపీ మారిటైమ్ బోర్డు చైర్మన్ కె.వెంకటరెడ్డి, సీపీ సీహెచ్ శ్రీకాంత్, జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్, జీవీఎంసీ కమిషనర్ పి.రాజాబాబు, పలు శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. అనంతరం గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ నిర్వహించే ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానాన్ని మంత్రి అమర్‌నాథ్ ఉన్నతాధికారులతో కలిసి పరిశీలించారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను తెలియజేసి.. ప్రపంచవ్యాప్తంగా పారిశ్రామికవేత్తలను ఆకర్షించేందుకు ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే పారిశ్రామికవేత్తలతో సమావేశం నిర్వహించినట్లు తెలిపారు.

విజ్ఞాన, వికాస కేంద్రం వర్సిటీ

- త్రిదండి చిన్న జీయర్ స్వామీజీ
- ఏయూలో విస్తృత పర్యటన



శమీ మొక్క నాటి నీరు పోస్తున్న చినజీయర్ స్వామీజీ

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామీజీ బుధవారం సందర్శించారు. ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాదరెడ్డి ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. ముందుగా ఏయూ ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థుల హాస్టళ్ల మధ్య నూతనంగా అభివృద్ధి చేసిన సుమారు 16 ఎకరాల క్రీడా మైదానాన్ని స్వామీజీ ప్రారంభించి.. శక్తి స్థూపం నిర్మాణానికి భూమిపూజ చేశారు. మైదానం అభివృద్ధికి సహకరించిన లవ్ అండ్ కేర్ మినిస్ట్రీస్ నిర్వాహకులు, ఏయూ పాలక మండలి సభ్యులు డాక్టర్ పి.ఏ సుపాదం, రాజారెడ్డి, రామకృష్ణరాజులను స్వామీజీ అభినందించారు. అనంతరం స్వామీజీ మాట్లాడుతూ విజ్ఞాన, వికాసానికి మూలకేంద్రంగా ఏయూ నిలవాలన్నారు. ఈ మైదానానికి ఊర్జా అని పేరు పెట్టినట్లు స్వామీజీ ప్రకటించారు. మైదానంలో ప్రత్యేకంగా నాలుగు స్థూపాలు, మధ్యలో పొడవైన స్థూపాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. అనంతరం స్వామీజీ శమీ మొక్క నాటగా.. విద్యార్థులు మైదానం చుట్టూ 108 ఔషధ గుణాలు కలిగిన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ ఆంధ్ర విశ్వవిద్యాలయం తన పూర్వవైభవాన్ని సంతరించుకుని మరింత పరిఢవిల్లుతుందన్నారు.

సాధన చేస్తేనే ఫలితం సాకారం

అనంతరం త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామీజీ ఏయూ యోగా కేంద్రాన్ని సందర్శించారు. ముందుగా పతంజలి మహర్షి విగ్రహానికి పూలమాల వేశారు. తర్వాత ఏయూ యోగా కేంద్రాన్ని పరిశీలించి విద్యార్థులనుద్దేశించి అనుగ్రహభాషణం చేశారు. యోగా కేంద్రం జాతీయ స్థాయిలో గుర్తింపు సాధించాలని ఆకాంక్షించారు. దేశ వ్యాప్తంగా ఈ కేంద్రం సేవలు విస్తరించే దిశగా ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. యోగా శిక్షకులకు ప్రపంచ వ్యాప్తంగా మంచి ఆదరణ ఉందన్నారు. దీనికి అనుగుణంగా నిపుణులను తీర్చిదిద్ది సమాజానికి అందించాలని సూచించారు. క్రమపద్ధతిలో యోగా విద్య నేర్చుకోవాలని విద్యార్థులను సూచించారు. నిరంతర సాధనతోనే లక్ష్యం సాకారం అవుతుందన్నారు. యోగా కేంద్రం సంచాలకుడు ఆచార్య ఓ.ఎస్.ఆర్ భాను కుమార్, డాక్టర్ కె.రమేష్‌బాబు, ఉద్యోగులు పాల్గొన్నారు. అనంతరం ఏయూ పరిపాలన భవనానికి చిన్న జీయర్ స్వామీజీ విచ్చేశారు. వీసీ ప్రసాదరెడ్డికి ఆశీస్సులు అందించి, వర్సిటీ మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.

భాష పరిరక్షణ..విద్యార్థుల అభ్యున్నతే లక్ష్యం



సదస్సులో మాట్లాడుతున్న లక్ష్మీపార్వతి

- తెలుగు అకాడమీ చైర్‌పర్సన్ లక్ష్మీపార్వతి

ఎంవీపీకాలనీ(విశాఖ తూర్పు): తెలుగు భాషను పరిరక్షిస్తూనే రాష్ట్ర ప్రభుత్వం పేద విద్యార్థుల అభ్యున్నతికి బాటలు వేస్తోందని తెలుగు, సంస్కృతం అకాడమీ చైర్‌పర్సన్ నందమూరి లక్ష్మీపార్వతి స్పష్టం చేశారు. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో బుధవారం 'మాతృభాషా చైతన్యం' అంశంపై సంస్థ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. లక్ష్మీపార్వతి మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో అంతర్జాతీయ అవకాశాల సాధన దిశగా పేద విద్యార్థుల్లో నైపుణ్యాన్ని పెంపొందించేందుకు ప్రభుత్వం అన్ని పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియంను అందుబాటులోకి తెచ్చిందన్నారు. అయితే ప్రతి విద్యార్థి ఒక సబ్జెక్టును కచ్చితంగా తెలుగులోనే చదవాలనే నిబంధన ఉందన్నారు. గత ప్రభుత్వాలు కార్పొరేటర్ స్కూల్ యాజమాన్యాలకు లబ్ధి చేకూర్చేందుకు తెలుగు అకాడమీని నిర్లక్ష్యం చేశాయన్నారు. యూనివర్సిటీల స్థాయిలో తెలుగుపై అవగాహన కల్పించేందుకు మాతృభాషా చైతన్యంపై సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి, అధికార భాషా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.విజయబాబు మాట్లాడారు. అనంతరం వేదుల సుబ్రహ్మణ్య శాస్త్రి, మరడాన శ్రీనివాసరావును సత్కరించారు. ఏయూ రెక్టార్ ఆచార్య కె.మమత, ఏయూ తెలుగు విభాగాధిపతి ఆచార్య జె.అప్పారావు, విశ్వనాథం పీఠం పి.సీతారామ ప్రభు తదితరులు పాల్గొన్నారు.

మధ్యతరగతికి వరం.. జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్

దొండపర్తి(విశాఖ దక్షిణ): మధ్యతరగతి ప్రజల సొంతింటి కలను సాకారం చేయాలన్న సంకల్పంతో జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్స్ ద్వారా ఎంఐజీ ప్లాట్లను మార్కెట్ కంటే తక్కువకే అందిస్తున్నట్లు వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల తెలిపారు. ఈ ఎంఐజీ ప్లాట్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ప్లాట్ల కేటాయింపుల కోసం బుధవారం గురజాడ కళాక్షేత్రంలో లాటరీ నిర్వహించారు. చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల చేతుల మీదుగా కంప్యూటరైజ్డ్ లాటరీ పద్ధతి ద్వారా 94 మంది దరఖాస్తుదారులకు ప్లాట్ల నంబర్లు కేటాయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆనందపురం మండలం పాలవలసలో అన్ని మౌలిక వసతులతో డీటీసీపీ ఆమోదంతో 54.94 ఎకరాల లే అవుట్‌లో 558 ప్లాట్లను అభివృద్ధి చేసినట్లు చెప్పారు. అన్ని సౌకర్యాలతో అతి తక్కువ ధరకు ప్లాట్లను అందిస్తున్నట్లు వివరించారు. జాయింట్ కమిషనర్ వి.రవీంద్ర మాట్లాడుతూ మార్కెట్ ధర కంటే తక్కువగా రూ.14,500లకే అన్ని సౌకర్యాలతో ప్లాట్లను అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఈ పథకాన్ని తీర్చిదిద్దుతున్నట్లు చెప్పారు. నగరానికి అత్యంత చేరువలో జాతీయ రహదారికి సమీపంలో అభివృద్ధి చేస్తున్న పాలవలస ఎంఐజీ లేఅవుట్‌లో ప్లాట్లను తగ్గింపు ధరకు అందిస్తున్న అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు లాటరీ ద్వారా ప్లాట్ల కేటాయింపులు పొందిన 94 మంది నెల రోజుల్లో ప్లాట్ విక్రయ ధరలో 30 శాతం చెల్లించాలన్నారు. అలాగే ఆరు నెలల్లోపు ప్లాట్ ధరలో మరో 30 శాతం, 12 నెలలలోపు లేదా రిజిస్ట్రేషన్ సమయంలో(ఏది ముందుగా జరిగే సమయం) ప్లాట్ ధరలో మిగిలిన మొత్తాన్ని చెల్లించాలని తెలిపారు.

ప్రజాస్వామ్య వ్యవస్థకు పునాది ఓటు



నూతన ఓటర్లకు కార్డు అందజేస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి గోపి



ర్యాలీని ప్రారంభిస్తున్న జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్

- ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి
- జిల్లా ప్రధాన న్యాయమూర్తి గోపి పిలుపు
- ఘనంగా జాతీయ ఓటరు దినోత్సవం

బీచ్‌రోడ్డు(విశాఖ తూర్పు): ఓటు హక్కు వినియోగించుకుంటున్న వయో వృద్ధులను యువత ఆదర్శంగా తీసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.గోపి పిలుపునిచ్చారు. సిరిపురంలోని వీఎంఆర్డీఏ చిల్డ్రన్ ఎరీనాలో 13వ జాతీయ ఓటర్ల దినోత్సవం బుధవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.గోపి.. కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జునతో కలిసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయమూర్తి మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. ఓటు అనే ఆయుధం ద్వారా సుపరిపాలన అందించే మంచి ప్రభుత్వాన్ని ఎన్నుకునే అవకాశం ఉందన్నారు.

అవార్డు ఆనందాన్నిచ్చింది : గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ చేతులమీదుగా బెస్ట్ ఎలక్టోరల్ ప్రాక్టీసెస్ అవార్డు స్వీకరించడం ఆనందంగా ఉందని కలెక్టర్ మల్లికార్జున అన్నారు. ఇందుకు సహకరించిన జిల్లా యంత్రాంగానికి ధన్యవాదాలు తెలిపారు. జిల్లాలో 18,95,918 మంది ఓటర్లు ఉన్నారన్నారు. 18, 19 ఏళ్ల వయసున్న 16,494 మంది కొత్తగా ఓటర్లుగా చేరినట్లు చెప్పారు. 185 మంది నిరాశ్రయులు, 125 మంది ట్రాన్స్‌జెండర్లకు కొత్తగా ఓటు హక్కు కల్పించామన్నారు. జేసీ కె.ఎస్.విశ్వనాథన్ మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ బూత్ లెవల్ ఆఫీసర్ వద్ద గానీ, ఎన్నికల సంఘం మొబైల్ యాప్, వెబ్‌సైట్‌లో గానీ ఓటు నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమానికి హాజరైన వారితో ఏయూ వీసీ పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి ప్రతిజ్ఞ చేయించారు. నూతనంగా ఓటు హక్కు పొందిన యువతకు అతిథులు ఓటర్ కార్డులు అందజేశారు. ప్రతి ఎన్నికలోనూ ఓటు హక్కు వినియోగించుకుంటున్న వయో వృద్ధులకు ప్రశంసాపత్రాలు బహూకరించారు. వివిధ పోటీల్లో విజేతలకు ప్రశంసాపత్రాలు ప్రదానం చేశారు. వివిధ కళాశాలల విద్యార్థులు, ఓటర్లు, అధికారులు ర్యాలీ నిర్వహించారు.

అధికారులకు అవార్డులు

ఓటర్ నమోదు ప్రక్రియలో ఉత్తమ ప్రతిభ చూపిన అధికారులకు కలెక్టర్ మల్లికార్జున అవార్డులు అందజేశారు. ఉత్తమ ఈఆర్వోగా విశాఖపట్నం ఆర్డీవో హుస్సేన్, ఏఈఆర్వోలుగా ఆనందపురం తహసీల్దార్ ఎల్.రామారావు, విశాఖ రూరల్ తహసీల్దార్ ఎం.పాల్‌కిరణ్, మహారాణిపేట ఇన్‌చార్జి తహసీల్దార్ వి.అర్జునరావు, సీతంపేట తహసీల్దార్ పి.శ్యామ్‌ప్రసాద్, జీవీఎంసీ జోన్-5 కమిషనర్ ఆర్.జి.వి కృష్ణ, జోన్-6 కమిషనర్ పి.సింహాచలం అవార్డులు స్వీకరించారు. జిల్లా వ్యాప్తంగా 14 మంది బీఎల్‌వోలకు అవార్డులు ప్రదానం చేశారు.

ఉత్తమ విధులకు గుర్తింపు



మహారాణిపేట: కలెక్టర్ ఎ.మల్లికార్జున బెస్ట్ ఎలక్టోరల్ ప్రాక్టీసెస్ అవార్డు స్వీకరించారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో బుధవారం రాష్ట్ర ఎన్నికల సంఘం జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహించింది. కార్యక్రమంలో భాగంగా గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ చేతులమీదుగా కలెక్టర్ ఈ అవార్డు అందుకున్నారు. అలాగే గాజువాక ఎన్నికల నమోదు అధికారి డి.లక్ష్మారెడ్డి ఉత్తమ ఎన్నికల నమోదు అధికారిగా, గాజువాక పోలింగ్ కేంద్రం 159 బూత్ లెవల్ అధికారి సునీత ఉత్తమ బూత్ లెవల్ అధికారిగా అవార్డు స్వీకరించారు.

లక్ష్య నిర్దేశకులదే విజయం



జయకేతనం: రఘు టెక్నాలజీ ఇన్‌స్టిట్యూట్ జట్టు



విజయదరహాసం: ఎస్ఆర్ జూనియర్ కళాశాల జట్టు



విజయహేల: ఏవీఎన్ పాలిటెక్నిక్ కళాశాల జట్టు

హోరాహోరీగా 'సాక్షి'ప్రీమియర్ లీగ్

విశాఖ స్పోర్ట్స్: 'సాక్షి'ప్రీమియర్ లీగ్(ఎస్పీఎల్) క్రికెట్ టోర్నీలో రెండో రోజు పోటీల్లో లక్ష్య నిర్దేశకులే విజయం సాధించారు. లక్ష్య ఛేదనలో వెనుకబడి జట్లు పరాజయం పాలయ్యాయి. 'సాక్షి'మీడియా ఆధ్వర్యంలో బుధవారం జరిగిన నాలుగు మ్యాచ్‌ల్లో మూడు మ్యాచ్‌ల్లో టాస్ ఓడిన జట్లు తొలుత బ్యాటింగ్ చేసి లక్ష్యాన్ని నిర్దేశించి విజయం సాధించాయి. జూనియర్స్‌కు జరిగిన హోరాహోరీ పోరులో సాంకేతిక పాలిటెక్నిక్ జట్టు కేవలం ఒక్క పరుగు వెనుకబడి ఓటమి పాలైంది. ఏయూ గోల్డెన్ జూబ్లీ మైదానంలో జరుగుతున్న ఈ పోటీలకు సీఎంఆర్ షాపింగ్‌మాల్ డిస్ట్రిక్ట్ స్పాన్సర్‌గా వ్యవహరిస్తోంది.

- రెండో రోజు తొలి మ్యాచ్‌లో రఘు టెక్నాలజీ ఇన్‌స్టిట్యూట్ టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగింది. నిర్ణీత 10 ఓవర్లలో నాలుగు వికెట్లు కోల్పోయి 71 పరుగులు చేసింది. పాల్ 19 పరుగులు చేశాడు. వరుణ్ మూడు వికెట్లు తీశాడు. ప్రతిగా దాడి వీరునాయుడు డిగ్రీ కళాశాల నాలుగు వికెట్లు కోల్పోయి 63 పరుగులే చేసి ఓటమి పాలైంది. సాయి 26 పరుగులు చేశాడు.
- తర్వాత మ్యాచ్‌లో ఎస్ఆర్ జూనియర్ కళాశాల టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగింది. ఎనిమిది ఓవర్లలో ఒక వికెట్‌కు 126 పరుగులు చేసింది. రాజ్‌కుమార్ (54) అర్ధసెంచరీ సాధించాడు. ప్రతిగా ఆళ్వార్‌దాస్ పాలిటెక్నిక్ కళాశాల జట్టు ఆరు వికెట్లు కోల్పోయి 37 పరుగులే చేసి ఓటమి పాలైంది. హర్ష రెండు వికెట్లు తీశాడు.
- మరో మ్యాచ్‌లో టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన సాయిగణపతి పాలిటెక్నిక్ జట్టు నిర్ణీత 10 ఓవర్లలో ఐదు వికెట్లు కోల్పోయి 83 పరుగులు చేసింది. తనిష్క్ 34 పరుగులు చేశాడు. వంశీ, మురళీ రెండేసి వికెట్లు తీశారు. ప్రతిగా ఎస్వీఎల్ఎస్ఎస్వీపీ జూనియర్ కళాశాల జట్టు ఐదు వికెట్లు కోల్పోయి 52 పరుగులే చేసి ఓటమి పాలైంది. చందు 26 పరుగులు చేశాడు. కుమార్ రెండు వికెట్లు తీశాడు.
- చివరి మ్యాచ్‌లో ఏవీఎన్ కళాశాల జట్టు టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగింది. మూడు వికెట్లకు 81 పరుగులు చేసింది. 33 అదనపు పరుగులు లభించాయి. ప్రతిగా సాంకేతిక జట్టు బ్యాటర్ వివేక్ 20 బంతుల్లోనే 38 పరుగులు చేసినా.. చివరికి మూడు వికెట్లు కోల్పోయి 80 పరుగుల వద్ద ఇన్నింగ్స్ ముగిసింది. హర్ష, చెన్నారావు, మోహన్ చెరో వికెట్ తీశారు.



విజయోత్సాహం: సాయిగణపతి పాలిటెక్నిక్ కళాశాల జట్టు

1న జీవీఎంసీ కౌన్సిల్ సమావేశం

డాబాగార్డెన్స్: జీవీఎంసీ కౌన్సిల్ సమావేశం ఫిబ్రవరి 1న నిర్వహించనున్నారు. ఈ సమావేశంలో 15 అంశాలపై చర్చించేందుకు అజెండా సిద్ధం చేశారు. దీన్‌దయాళ్‌పురంతో పాటు పలు రహదారుల వెడల్పు చేసేందుకు ప్రధానంగా చర్చించనున్నారు. నగరంలో పలు వార్డుల్లో అభివృద్ధి పనులకు సంబంధించి చర్చిస్తారని సమాచారం.

ఏసీఏ అధ్యక్షుడి కుటుంబంలో విషాదం

దొండపర్తి: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు శరత్ చంద్రారెడ్డి ఇంట్లో విషాదం చోటుచేసుకుంది. అతని నానమ్మ(అరబిందో రాంప్రసాద్‌రెడ్డి తల్లి) లక్ష్మీనారాయణమ్మ బుధవారం సాయంత్రం 4.30 గంటలకు కన్నుమూశారు. దీంతో అతని కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది. 28వ తేదీ సాయంత్రం 4 గంటలకు హైదరాబాద్‌లో విష్పర్ వ్యాలీ పక్కన ఉన్న మహాప్రస్థానంలో అంత్యక్రియలు జరగనున్నాయి.



మత్తు ఇంజక్షన్లు స్వాధీనం

సీతమ్మధార (విశాఖ ఉత్తర): గుట్టుగా మత్తు ఇంజక్షన్లు సరఫరా చేస్తున్న ముఠాని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) అధికారులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి ఇంజక్షన్లు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ... గోపాలపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలోని జ్ఞానాపురం బస్టాప్ వెనుక సర్వీస్ రోడ్డులో మత్తు ఇంజక్షన్లు విక్రయిస్తుండగా గోపాలపట్నం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులకు వచ్చిన సమాచారంతో టాస్క్‌ఫోర్స్, ఎస్ఈబీ అధికారులు సంయుక్తంగా దాడులు చేశారు. ముగ్గురిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి అనుమతులు లేకుండా కొనుగోలు చేసిన పెంటాజోసిన్ లాక్టట్ ఇంజక్షన్లు 76 స్వాధీనం చేసుకున్నారు. డాబాగార్డెన్స్ సమీప గొల్లలపాలెంకు చెందిన చీటికిరెడ్డి వెంకట శ్రీకాంత్, టీఎస్ ఎన్‌కాలనీలో హేమ రెసిడెన్సీకి చెందిన వెన్నెల వెంకటరావు, ఇంజక్షన్లు సరఫరా చేసిన ఖరగ్‌పూర్‌కు చెందిన అనుపమ్ అధికారిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. పశ్చిమ బెంగాల్‌కు చెందిన అనుపమ్ అధికారి మత్తు ఇంజక్షన్లు నగరానికి తీసుకొచ్చి పలు ప్రాంతాల్లో విక్రయిస్తున్నట్లు దర్యాప్తులో తేలిందని అధికారులు తెలిపారు. ఈ దాడుల్లో డీఎస్ఈవో, జాయింట్ డైరెక్టర్ బి.శ్రీనివాసరావు, ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ బి.శ్రీనాథుడు, సీఐ సీహెచ్‌వీఎస్ ప్రసాద్, ఎస్ఐ పి.శాంతి లక్ష్మి, టాస్క్‌ఫోర్స్ సీఐలు కల్యాణి, కరణం సురేష్, ఎం.సురేస్, డేవిడ్ రాజు, శ్రీకాంత్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా టూరిజం వాక్‌థాన్

బీచ్‌రోడ్డు (విశాఖ తూర్పు): జాతీయ పర్యాటక దినోత్సవం సందర్భంగా బుధవారం ఆంధ్రప్రదేశ్ టూరిజం ఆధ్వర్యంలో నిర్వహించిన టూరిజం వాక్‌థాన్ ఉత్సాహంగా సాగింది. ఆర్కే బీచ్ నుంచి వైఎస్సార్ విగ్రహం వరకు సాగిన ఈ వాక్‌థాన్‌ను జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యాటక రంగంలో సంస్కృతి, కళలు, సాంఘిక, రాజకీయ, ఆర్థిక విలువలపై అవగాహన కల్పించేందుకు ఈ వాక్‌థాన్‌ను నిర్వహించినట్లు తెలిపారు. పర్యాటక ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన వ్యాస రచన, వక్తృత్వ పోటీల విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో టూరిజం అధికారులు, కాలేజీ విద్యార్థులు పాల్గొన్నారు.

విభజనతోనే దేశానికి తీవ్ర నష్టం

ఆర్ఎస్ఎస్ జాతీయ కార్యవర్గ సభ్యుడు రామ్‌మాధవ్



ప్రొఫెసర్ ప్రసన్నకుమార్‌కు పుస్తకం బహూకరిస్తున్న రామ్‌మాధవ్

మద్దిలపాలెం (విశాఖ తూర్పు) : స్వేచ్ఛ కంటే విభజనతోనే దేశానికి తీవ్ర నష్టం వాటిల్లిందని, దేశ విభజన దుష్పరిణామాలను ఇప్పటికీ అనుభవిస్తున్నామని ఆర్ఎస్ఎస్ జాతీయ కార్యవర్గ సభ్యుడు డాక్టర్ రామ్‌మాధవ్ విచారం వ్యక్తం చేశారు. తాను రచించిన పార్టిటియోనెడ్ ఫ్రీడమ్ పుస్తకావిష్కరణ సభ మద్దిలపాలెంలోని కళాభారతి ఆడిటోరియంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1905లో జరిగిన బెంగాల్ విభజనను దేశ ప్రజలంతా వ్యతిరేకించారన్నారు. దీంతో 1911లో కింగ్ జార్జ్ ఆ విభజనను రద్దు చేశారన్నారు. కానీ 1947లో మతం ఆధారంగా దేశం రెండు ముక్కలయిందని విచారం వ్యక్తం చేశారు. గాంధీ, జిన్నాలలో కొన్ని విషయాల్లో పోలికలున్నాయన్నారు. గాంధీపై కొందరు జిన్నా పక్షపాతి అని ముద్ర వేశారన్నారు. 30 ఏళ్లలో దేశంలో మతం పేరిట కొన్ని తప్పులు జరిగాయన్నారు. చరిత్ర నుంచి గుణపాఠాలు నేర్చుకోవాలన్నారు. దేశ విభజన సమయంలో లక్షలాది మంది చనిపోయారన్నారు. స్వాతంత్య్రం కోసం కాంగ్రెస్ చేసిన ఉద్యమానికే ప్రాచుర్యం లభించిందని, అయితే ఇంకా ఎందరో ఆ సమయంలో ఉద్యమించారన్నారు. సెంటర్ ఫర్ పాలసీ స్టడీస్ డైరెక్టర్ ప్రొఫెసర్ ప్రసన్నకుమార్ మాట్లాడుతూ భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక క్రికెట్ అని పేర్కొన్నారు. ప్రపంచం బాగుంటేనే దేశం బాగుంటుందన్నారు. అందుకోసం కేంద్రంలో బీజేపీ, ఆర్ఎస్ఎస్ బలమైన పునాది వేశాయని తెలిపారు. నైతిక విలువలతో కూడిన విద్యారంగం పటిష్ఠంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.విష్ణుకుమార్‌రాజు, బీజేపీ అధికార ప్రతినిధి సుహాసిని, శాసనమండలి సభ్యుడు పీవీఎన్ మాధవ్, ఆర్ఎస్ఎస్ మహానగర్ సంఘ్ చాలక్ పీవీ నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

యథావిధిగా రైళ్ల రాకపోకలు

తాటిచెట్లపాలెం : సౌత్ ఈస్టర్న్ రైల్వే, ఖరగ్‌పూర్ డివిజన్ పరిధిలో జరుగుతున్న ఆధునికీకరణ, భద్రతా పనుల నిమిత్తం ముందుగా ప్రకటించిన విధంగా ఆయా తేదీల్లో రైళ్ల రద్దు చేయలేదని, ఆ రైళ్లను పునరుద్ధరిస్తున్నందున యథావిధిగా రాకపోకలు సాగిస్తాయని సీనియర్ డీసీఎం ఏకే త్రిపాఠి తెలిపారు. ఈనెల 29, 31, ఫిబ్రవరి 1వ తేదీల్లో హైదరాబాద్ - షాలిమార్ (18046) ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్ యథావిధిగా షెడ్యూల్ ప్రకారం నడుస్తుందని తెలిపారు. తిరుగు ప్రయాణంలో ఈనెల 30, ఫిబ్రవరి 1,2 తేదీల్లో షాలిమార్-హైదరాబాద్ (18045) ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్ కూడా షెడ్యూల్ ప్రకారం నడుస్తుందన్నారు.

చైతన్య కళాశాల విద్యార్థిని ఆత్మహత్య

కొమ్మాది: బీచ్‌రోడ్‌లోని చైతన్య కళాశాల హాస్టల్‌లో ఓ విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... జీవీఎంసీ 4వ వార్డు కాపులుప్పాడలో గల చైతన్య కళాశాలలో అనకాపల్లి జిల్లా మునగపాకకు చెందిన విద్యార్థిని అనూష యాదవ్(17) ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు తోటి విద్యార్థినులతో చదువుకుంది. అనంతరం తన గదిలోకి వెళ్లి ఎంతసేపటికీ బయటకు రాకపోవడంతో తోటి విద్యార్థినులు వెళ్లి చూడగా అనుమానాస్పదంగా మృతి చెంది ఉంది. అయితే చదువు ఒత్తిడి తట్టుకోలేకనో, మరేమైనా కారణాల వల్లో అనూష ఆత్మహత్య చేసుకుని ఉంటుందని భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. సీఐ లక్ష్మణమూర్తి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

7న ఉక్కు పర్సనల్ డైరెక్టర్ ఎంపిక

ఉక్కునగరం: కొద్ది నెలలుగా ఎదురు చేస్తున్న స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (పర్సనల్) సెలక్షన్ ఫిబ్రవరి 7న నిర్వహించనున్నారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వానికి చెందిన పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ సెలక్షన్ బోర్డు (పీఇఎస్‌బి) షెడ్యూల్ విడుదల చేసింది. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించే ఈ సెలక్షన్ ప్రక్రియకు విశాఖ స్టీల్ ప్లాంట్‌కు చెందిన అధికారులు జి.గాంధీ, ఎం.మధుసూదనరావు, కె.సంజీవరావు, బినయ్ ప్రసాద్, ఎస్.భాను, ఎస్.వి.ఎస్. రాజు, సెయిల్ నుంచి సురేష్ చంద్ర పాండే, స్వరజిత్ జీ జచుక్, బీఎస్ఎస్ఎల్ నుంచి సౌరభ్ త్యాగి, ఇంజనీర్స్ ఇండియా లిమిటెడ్ నుంచి అతను భౌమిక్, ఇండియన్ రైల్వే నుంచి ఎల్.వి.ఎస్.సత్యనారాయణ పాత్రుడు, రాజేంద్ర కుమార్ అగర్వాల్ హాజరవుతున్నారు.